క్లుప్తంగా

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో రైతు బిట్లి కృష్ణయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ సర్పంచ్ బక్షి హనుమాన్‌రావు రైతు కుటుంబాన్ని పరామర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతో రైతుబీమా ఉండటంతో భార్య మనెమ్మకు రూ.5లక్షలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రనాగన్న, కొండన్న, దావిద్, రాజ్‌కుమార్, కాశన్న, బాలీశ్వర్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

పాన్‌గల్: ఈనెల 23వ తేదీన మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, వెంకటయ్యనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

23న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



పాన్‌గల్: ఈ నెల 23వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మొటిక్ ఛార్జీల బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉచితబస్ పాసులను ఇవ్వాలనే డిమాండ్లపై విద్య సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బంద్‌కు తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రామకృష్ణ, అజయ్, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

పందుల అపహరణ.. కేసు నమోదు



ఆత్మకూర్: పందులను అపహరించిన సంఘటనలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి పట్టణ శివారులోని బ్రిడ్జికింద పెంచుతున్న పందులను బొలేరో వాహనంలో వచ్చిన దొంగలు పందులను అపహరించినట్లు వివరించారు. సోమవారం పందుల యజమానుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత



ఖిల్లాఘనపురం: మండలంలోని పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సోమవారం ఎస్సై నరేశ్ బాధితులకు అప్పగించారు. 21 నెలల క్రితం రోడ్డుమీదితండాకు చెందిన లాలమ్మ, రుక్కన్నపల్లి గ్రామానికి చెందిన కె.శివ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. దీంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసి సోమవారం బాధితులకు అప్పగించామని ఎస్సై చెప్పారు. మొబైల్ ట్రేస్‌చేసి రికవరి చేసేందుకు కృషి చేసిన కానిస్టేబుల్ లింగంను ఎస్సై అభినందించారు.

బైక్ చోరీ

కొత్తకోట రూరల్: బైక్ చోరీకి గురైన సంఘటన పట్టణంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ ఆనంద్ వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన సద్దాం ఖురేషి తన బైక్ (టీఎస్31సీ 2113)ను రాహుల్ ఆసుపత్రి ఎదుట పార్కింగ్ చేశారు. సమీపంలో ఉన్న షాపుల్లోకి వెళ్లి పని ముగించుకుని వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గుంతల రోడ్లు.. తప్పని పాట్లు



ఎన్‌హెచ్‌-44 నుంచి రాంపురం గ్రామానికి వెళ్లే రహదారి

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ప్రమాదాల బారిన వాహనదారులు



పెద్దగూడెం నుంచి కదుకుంట్లకు వెళ్లే రోడ్డు

వనపర్తి రూరల్: గ్రామీణ ప్రాంత బీటీ రోడ్లు గుంతల మయంగా మారాయి. ఐదారేళ్లుగా రోడ్ల మరమ్మతుపై అధికారులు దృష్టి సారించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. రోడ్లపై తారులేచి రాళ్లు తేలాయి. గుంతలుగా ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులకు నిరంతరం ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులపై రెండు వాహనాలు ఎదురుగా వస్తే వాహనం రోడ్డు దిగినప్పుడు పక్కల ఉన్న గుంతలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే బాధలు వర్ణనాతీతమని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెబ్బేరు మండలంలోని ఎన్‌హెచ్‌-44 నుంచి రాంపురం , రామ్మమపేట, వనపర్తి మండలంలోని పెద్దగూడెం నుంచి కదుకుంట్ల వరకు వెళ్లే రహదారులు గుంతలు ఏర్పడి ప్రయాణానికి అనువుగా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

> **అధికారులు స్పందించాలి**
>
> గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో గ్రామస్తులందరు కలిసి గుంతలు ఉన్న వాటిపై మట్టివేయించాం. కాని పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. కానీ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి.
>
> – ఎంకే మూర్తి, రాంపురం
>
> **మరమ్మతు చేపట్టండి**
>
> పెద్దగూడెం నుంచి కదుకుంట్ల గ్రామానికి ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. గుంతల్లో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో పలువురు గాయాల బారిన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలన్నారు.
>
> – కొండన్నగౌడ్, కదుకుంట్ల

రోడ్డు వేశారు.. ర్యాంపులు మరిచారు



కొత్తూర్ రోడ్డుపై ర్యాంపు మరిచిన కాంట్రాక్టర్

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 11వ, 7వ వార్డులో కొత్తూర్ రోడ్డు గుంతల మయంగా ఉండటంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంతో దాదాపు 500 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ రోడ్డు వెంట ఉండే కాలనీల్లోకి వెళ్లే వారి కోసం ర్యాంపులు వేయడం మర్చిపోయారు. దీంతో మట్టికట్టలను తొలగించినా అదేవిధంగా ఉండటంతో వాహనదారులు వెళ్లేవారు అదుపుతప్పి కిందపడటంతో గాయాలపాలవుతున్నారు. బుడగజంగాల కాలనీకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అంతే కాకుండా చెత్తబండి, వాటర్‌ట్యాంకర్ సైతం రావడం లేదని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి ర్యాంపు నిర్మాణాలు చేయాలని కాలనీవాసులు డి.గణేష్, శివయ్య, కాళీదాస్, నర్సింహా తదితరులు కోరుతున్నారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



ఆత్మకూర్: అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలో పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఖర్గే నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతంగా మారిందని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాహుల్‌గాంధీ పీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేశ్, తులసిరాజ్, శ్రీను, దామోదర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

ఖర్గే జన్మదిన వేడుకలను అమరచింతలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్, రవికాంత్ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

మదనాపురం: బీఆర్‌ఎస్ శ్రేణులు స్థానిక సంస్థలకు సిద్ధం కావాలని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ అన్నారు. మండలంలోని శంకరమ్మపేటలో సోమవారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పని చేసి అన్ని గ్రామాల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజానీకాన్ని మోసం చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో–ఆప్షన్ చాంద్‌పాషా, విజయేందర్‌రెడ్డి, మాసన్న, రాజకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేందుకే శ్రీకృష్ణుడి అవతారం



ఖిల్లాఘనపురం: భూ లోకంలో ప్రజల కష్టాలు తీర్చేందుకే శ్రీకృష్ణుడిగా జన్మించారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు వి.రాఘవేంద్ర ఆచారి అన్నారు. సోమవారం మండలంలోని షాపురం గ్రామంలో మద్దిగట్ల కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రవి, సుదర్శన్, మనోహర్ పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

వీపనగండ్ల: మండలంలోని ఫెస్టిఫైడ్ కొనుగోలు కేంద్రాల్లో విత్తనాలను తీసుకున్న వెంటనే రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని ఏఓ డాకేశ్వర్‌గౌడ్ సూచించారు. మండలంలో మొత్తం 21 ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలకు లైసెన్స్‌లు పొందారన్నారు. వాటిలో కల్వరాల, గోవర్ధనగిరి, వీపనగండ్ల, సంగినేనిపల్లి, తూముకుంట గ్రామాలతో కలిపి మొత్తం 8 షాపుల్లో మాత్రమే వరి విత్తనాలను విక్రయిస్తున్నారన్నారు. బీపీటీ 5204, కేఎస్‌ఎం 1638, ఆర్‌ఎస్‌ఆర్ 15048 సన్నరకం అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే రైతులు మంగళవారం మండలకేంద్రంతో పాటు గోపాల్‌దిన్నె, బొల్లారం గ్రామాల రైతువేదికలో రైతునేస్తంలో పాల్గొని సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

జేబులు నింపుతున్న ప్రాక్టీస్

- పల్లెల్లో విచ్చలవిడిగా ఆర్‌ఎంపీల దందా
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- వైద్యం పేరుతో అక్రమ సంపాదన



ఖిల్లాఘణపురంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన దృశ్యం (ఫైల్)

మదనాపురం: సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం ఇది. జనం రోగాల బారిన పడుతున్నారు. ఇదే అదనుగా భావించి అందినకాడికి దండుకోవాలనుకుంటున్నారు కొందరు గ్రామీణ వైద్యులు. ప్రథమ చికిత్సకు పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు వ్యాధులు ఏదైనా చికిత్స చేస్తామంటూ జేబులు నింపుకొంటున్నారు. ప్రాక్టీస్‌పేరుతో క్లినిక్ పెట్టడమే కాకుండా మందులు సైతం అమ్ము తున్నారు. కొందరైతే అర్హత లేకున్నా ఆర్‌ఎంపీలమని చెప్పుకొంటూ చికిత్సలు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో కొద్దికొద్దిగా వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. క్లినిక్‌లు ప్రైవేట్ ఆసుపత్రులకు పోటీగా కొనసాగుతున్నాయి.

వైద్యం అందుబాటులో ఉన్నా..

వనపర్తి జిల్లాగా ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. ఎంసీహెచ్ ప్రత్యేకంగా మహిళకు చాలా దోహదపడుతుంది. డెలీవరీలు, గర్భిణులు పర్యవేక్షణతో పాటు అన్నిరకాల రోగాలకు ఇక్కడ చికిత్స చేస్తారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సైతం సీనియర్ డాక్టర్లు అయిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ఎంతో మంచి డాక్టర్లు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. మీ ఆరోగ్య సమస్యలకు మేం చికిత్స చేస్తామంటూ అక్కడికి వెళ్లకుండా గ్రామాల్లోని ప్రజలకు ఏ మార్పి కొంతమంది అక్రమంగా వైద్యం చేస్తున్నారు. రోగులకు సెలైన్, ఇంజెక్షన్లు ఇస్తూ డబ్బులు దండుకుంటున్నారు. కొంతమందికి ప్రభుత్వ ఆస్పతులపై ఆపోహలు ఉండటంతో చేసేదేమీ లేక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. తమవద్ద వైద్యం వికటించిన రోగులును గుట్టుచప్పుడు కాకుండా ఆర్ ఎంపీలు రాజీ చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఎంబీబీఎస్ అర్హత సాధించిన డాక్టర్ల మాదిరిగా ఆయా తమ క్లినిక్‌లో బెడ్స్ బ్లెడ్ షాంపిల్స్ మందుల సెటప్ ఏర్పాటు చేసుకున్నారు. మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, గోపాల్‌పేట, అమరచింత, ఆత్మకూర్, ఖిల్లాఘణపురం, పాన్‌గల్ మండలాల్లో ఎక్కువ సంఖ్యలోఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు గ్రామాల్లో అడ్డగోలుగా చేస్తున్న వైద్యంపై జిల్లా వైద్య బృందం ప్రత్యేకదృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజ్‌చేసిన ఆర్‌ఎంపీల క్లినిక్‌లు

పెద్దమందడి మండలం బలిజపల్లిలో 2, కొత్తకోట మండలం పాలెంలో 2, శ్రీరంగాపురం 2, వనపర్తి 4, పాన్‌గల్ 2, ఖిల్లా ఘనపూర్ 9 ఆర్‌ఎంపీ క్లినిక్‌లకు మొత్తం 21 అధికారులు సీజ్ చేశారు.

> **ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి**
>
> 
>
> గ్రామాల్లో ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తే కఠినచర్యలు తీసుకుంటాం. అత్యవసర సమయంలో ప్రథమచికిత్స మాత్రమే చేయాలి. సెలైన్లు యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటివి చోటు చేసుకుంటే క్లీనిక్‌లు సీజ్ చేస్తాం. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉన్నారు. జిల్లా కేంద్రంలో మెరుగైన ఆసుపత్రి ఉంది. ప్రజలు ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించుకోవద్దు.
>
> – శ్రీనివాసులు జిల్లా వైద్యాధికారి

ఎర్రజెండాను అంతం చేయడం ఎవరితరం కాదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్

పాన్‌గల్: కమ్యూనిస్టుల ఎర్రజెండాను అంతం చేయడం బీజేపీ తరం కాదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ జిల్లా 3వ మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో శ్రమదోపిడి ఉన్నంతకాలం పోరాటచిహ్నం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందన్నారు. పీఎం నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కమ్యూనిస్టులను అంతం చేస్తామని చెబుతున్నారని వందేళ్ల చరిత్రలో ఇలాంటి వారిని ఎంతోమందిని కమ్యూనిస్టులు చూశారన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను ఒక శాతం ఉన్న సంపన్నులకు కట్టబెట్టి 99 శాతం సామాన్య, పేదప్రజల పొట్టలను కొడుతుందన్నారు. దోపిడిని మభ్య పెట్టేందుకు మతం రాగం అందుకుందని బీజేపీ మతోన్మాదాన్ని పేదలు, సామాన్యులు తెలుసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఈనెల 23, 24వ తేదీల్లో ఆత్మకూర్‌లో నిర్వహించే మహాసభలకు జిల్లానుంచి పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళావతమ్మ, రమేశ్, కుర్మయ్య, బాలస్వామి, రాముడు, శాలి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నిరంజన్‌రెడ్డి

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త రవికుమార్‌రెడ్డి తల్లి చంద్రకళ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని మృత దేహనికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్, వీరసాగర్, వెంకటయ్యనాయుడు, సుధాకర్‌యాదవ్, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ..

కొత్త చంద్రకళ కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డా.పగిడాల శ్రీనివాసులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి పండుగ

- చండీయాగం, బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలోని బెస్తగేరిలో ఉన్న గంగమ్మ ఆలయం దగ్గర అమ్మవారి పండుగను కనులపండుగగా నిర్వహించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి మూడేళ్లు కావడంతో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఛండీయాగం, అమ్మవారి పల్లకిసేవ, శివపార్వతుల కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనంలో అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్లారు. వీధులగుండా మహిళలు ఆలయం దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ మాజీ సర్పంచులు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రతిభా అవార్డు గ్రహీతకు సన్మానం



బైరోజు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తిటౌన్: శిల్పకళా రంగంలో సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీ నుంచి అందుకున్న రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కార బైరోజు చంద్రశేఖర్‌ను సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి సన్మానించారు. పదేళ్ల తర్వాత కవులకు, కళాకారులకు తగిన ఆదరణ లభించిందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన కంఠస్వరంతో ప్రభుత్వ, ప్రైవేట్, సామాజిక, రాజకీయ, సాహిత్య, కళారంగాల సభలకు సమావేశాలకు గౌరవం పెరిగిందని చెప్పారు. ప్రతిఒక్కరికి కంఠస్వరం అద్భుతంగా ఉండదని, ఒకవేళ ఉన్నా కొందరినే ఆకట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రతినిధులు శ్రీనివాసులు, రాములు యాదవ్, శ్యాంసుందర్, రాయన్న పాల్గొన్నారు.

పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



పెంపకందారులకు సభ్యత్వం అందజేస్తున్న బాలరాజుయాదవ్

వీపనగండ్ల: గొర్లు, మేకల పెంపకందారులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కన్వీనర్ బాలరాజుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గోవర్ధనగిరి గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. గొర్రెపిల్లలను ఉచితంగా పంపిణీ చేసి వాటిమేత కోసం బంజరు భూములను చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ బాల పీర్‌యాదవ్, వెంకటేష్, మోహన్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి గాయాలు

వనపర్తి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. రాజనగరం వడ్డెగేరికి చెందిన దాసర్లరమేష్ ఆదివారం రాత్రి కొత్తకోట నుంచి రాజనగరం బైక్‌పై వస్తున్నారు. రాజపేట శివారులోని కొండగట్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రమేశ్‌కు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వ్యక్తి రమేశ్ బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి ఆసుపత్రికి పంపించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వెల్‌నెస్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సోమవారం రమేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వృథాగా పోతున్న నీరు..!

- పట్టించుకోని అధికారులు
- పడమటి తూముకు పగుళ్లు, లీకేజీలు
- చెరువు ఆధునికీకరించాలి



పడమటితూముకు పగుళ్లు

అమరచింత: పట్టణంలోని పెద్దచెరువుకు సంబంధించిన పడమటి తూము కొన్ని నెలలుగా పగుళ్లు, లీకేజీతో సాగునీరు వృథా వుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోలేని దుస్థితి ఏర్పడింది. పెద్దచెరువు పరిధిలో 360 ఎకరాల ఆయకట్టు సాగవుతున్నది. గత కొనేళ్లుగా భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు చెరువుకు అందుతుండటంలో ఆయకట్టు రైతులు ఏడాదిలో రెండు పంటలను పండించుకుంటున్నారు. సుమారు 200 వందల కుటుంబాలకు చెందిన మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. మండలంలోనే అతిపెద్దదైన చెరువును ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఆయకట్టు రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్న పట్టించుకునే నాయకులే కరువయ్యారు.

నెర్రెలు బారుతున్న చెరువుకట్ట

చెరువు ప్రధాన ఆనకట్ట నెర్రెలు వారుతున్న నీటిపారుదల శాఖ అధికారులు వాటిని గుర్తించలేకపోతున్నారు. వీటికితోడు ఆనకట్టకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో రైతుల ద్విచక్రవాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అమరచింత మున్సిపాలిటీగా ఏర్పడటంతో ముళ్ల పొదలను ఈజీఎస్ ద్వారా తొలగించలేని దుస్థితి ఏర్పడింది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వంద రోజుల పనులతో చెరువులో పూడికతోపాటు ముళ్ల పొదలను తొలగించేవారని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి పడమటి తూము మరమ్మతు పనులు వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు ఆటంకం కలగకుండా ఉండాలని కోరుతున్నారు.